


ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 6-10-2026 | సంపుటి - 31 | సంచిక - 134 | రూ : 4 | పేజీలు: 8

తెలంగాణ హైకోర్టు తాత్కాలిక సీజేగా
జస్టిస్ శ్యాంకోశీ

సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు జడ్జి కావడంతో నియామకం



- మరో ఇద్దరు ప్రధాన న్యాయమూర్తులూ సుప్రీం కోర్టుకు..
- నియామకాలకు రాష్ట్రపతి ఆమోదం
- నేడు ప్రమాణ స్వీకారం

దిల్లీ: సుప్రీంకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తుల పేర్లను సిఫార్సు చేస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. దీంతో తెలంగాణ, గుజరాత్, దిల్లీ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులుగా పని చేస్తున్న జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ సునీతా అగర్వాల్, జస్టిస్ దేవేంద్ర కుమార్ తరువాయి 2లో

కృష్ణా జలాల సద్వినియోగంపై
దృష్టి సారించండి!

- డిండి ఎత్తిపోతల సమస్యలను పరిష్కరిస్తాం
- కాళేశ్వరం అదనపు టీఎంసీ పనుల్లో పెండింగ్ అంశాలపై నివేదిక రూపొందించండి
- రూ.కోట్లు ఖర్చు చేసి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వకుంటే ఎలా?
- నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: కృష్ణా బేసిన్ పరిధిలో ఇంకా నీటి వినియోగానికి ఎక్కడెక్కడ అవకాశాలు ఉన్నాయో పరిశీలించాలని, ప్రస్తుతం ప్రాజెక్టుల వారీగా ఉన్న కేటాయింపులు పోను మిగిలిన జలాలను వాడుకోవడానికి ఉన్న అవకాశాలపై దృష్టి సారించాలని నీటిపారుదల ఇంజినీర్లు, అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. సోమవారం రాత్రి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటిపారుదల ప్రాజెక్టులపై సీఎం సుదీర్ఘంగా చర్చించారని, కృష్ణా జలాల సద్వినియోగంపై దృష్టి సారించాలని సూచించారని సమాచారం. తరువాయి 2లో




మహిళలపై నేరాలకు
చెక్ పెట్టండి: సుప్రీం

- సామాజిక వ్యతిరేక శక్తుల్లో భయం సృష్టించాలని ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు సూచన
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం
- నేరం జరిగాక చర్యల కన్నా నివారణే ముఖ్యమని స్పష్టం చేసిన కోర్టు
- బీట్ పెట్రోలింగ్, నిఘా పెంచాలని, చీకటి ప్రదేశాలపై దృష్టి పెట్టాలని ఆదేశం
- చట్టవిరుద్ధ తినుబండారాల కేంద్రాల వద్ద పోకిరీల ఆగడాలను అరికట్టాలని సూచన 2లో

'ఆప్టోజెనెటిక్స్'కు గుర్తింపు
ఈ ఏడాది వైద్యంలో ముగ్గురికి నోబెల్

- వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన
- కార్ల్ డీస్సెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్‌లను వరించిన పురస్కారం
- ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం
- కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత



- జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు తరువాయి 2లో

కేంద్రం, ఈసీకి
సుప్రీంకోర్టు నోటీసులు

- సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం విచారణ
- కేంద్ర ప్రభుత్వం, ఈసీకి వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు
- ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాల్లో సీఈసీ ఒంటరిగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణ
- చట్టవిరుద్ధమైన నిర్ణయాలు ఉంటే రద్దు చేస్తామన్న సుప్రీంకోర్టు ధర్మాసనం
- సీఈసీ విధులకు ఆటంకం కలిగించేలా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరణ 2లో



వర్క్ వీసాలపై ట్రంప్ కొరడా..
ఈ వారమే నిర్ణయం!

- విదేశీ వర్క్ వీసాలపై ఈ వారంలో కఠిన చర్యలకు ట్రంప్ సర్కార్ సిద్ధం
- అమెరికన్ ఉద్యోగాలకే తొలి ప్రాధాన్యమంటూ కార్మిక శాఖ ఉన్నతాధికారి సంకేతం
- ఇప్పటికే హెచ్-1బీ వీసాలపై పలు ఆంక్షలు విధించిన ట్రంప్ యంత్రాంగం 2లో



భారత్‌అమెరికా
వాణిజ్య చర్చలకు బ్రేక్: నిర్మల

- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి



భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం తరువాయి 2లో

లండన్-షికాగో విమానంలో ఎమర్జెన్సీ..
నిమిషాల్లో 28,000 అడుగులు కిందకు

- బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో ఎమర్జెన్సీ
- ఐర్లాండ్ మీదుగా వెళుతుండగా ఘటన
- 7700 ఎమర్జెన్సీ కోడ్ యాక్టివేట్
- విమానాన్ని 9,000 అడుగులకు దించిన వైనం
- కారణం ఇంకా వెల్లడించని బ్రిటిష్ ఎయిర్‌వేస్



లండన్ నుంచి అమెరికాలోని షికాగోకు వెళుతున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో సోమవారం అత్యవసర పరిస్థితి తలెత్తింది. ఐర్లాండ్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో విమానం ఎమర్జెన్సీ ప్రకటించింది. వెంటనే పైలట్లు 7700 ఎమర్జెన్సీ కోడ్‌ను యాక్టివేట్ చేసి.. విమానాన్ని 37,000 నుంచి సుమారు 9,000 అడుగుల కిందకు దించారు. నిమిషాల్లో ఏకంగా 28,000 అడుగులు కిందకు రావడం గమనార్హం. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్24 ప్రకారం.. బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం బీఏ295 అట్లాంటిక్ మీదుగా ప్రయాణిస్తుండగా ఎమర్జెన్సీ అలర్ట్ వచ్చింది. బోయింగ్ విమానం ఒక్కసారిగా తరువాయి 2లో

సింగరేణి కార్మికులకు లాభాల వాటాను వెంటనే చెల్లించాలి

*** టీబీజీకేఎస్ కాపు కృష్ణ డిమాండ్**




ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం :సింగరేణి కార్మికులు తమ కష్టాన్ని చిందించి సాధించిన బొగ్గును విక్రయించడం ద్వారా వచ్చిన నికర లాభాలను తక్షణమే ప్రకటించాలని, అందులో నుండి 36% కార్మికుల వాటాగా చెల్లించాలని టీబీజీకేఎస్ ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపుకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లాభాల వాటా ప్రకటించిన దాంట్లో సగం మాత్రమే చెల్లించారని , గడిచిన రెండేళ్లలో కార్మికులు సాధించిన బొగ్గు విక్రయం ద్వారా వచ్చిన డబ్బులలో 6వేల 300 వందల కోట్ల రూపాయలను సంస్థ అభివృద్ధి కోసం పక్కన పెట్టారని వాటి వివరాలను వెల్లడించడం లేదని , మెడికల్ బోర్డు నిర్వహించకుండా కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. బొగ్గు గనులపై కార్మికులు టోల్సు రక్షణ పరికరాలు లేవని ఆవేదన వ్యక్తపరిచారు. బొగ్గు ఉత్పత్తికి, లాభాల వాటా తేదీని తక్షణమే ప్రకటించకుంటే సింగరేణి కార్పొరేట్ కార్యాలయం తో పాటు ప్రజాభవన్ ను ముట్టడించడానికి వెనకాడేది లేదని హెచ్చరించారు. అనంతరం గని మేనేజర్స్ డిపార్ట్మెంట్ హెడ్ లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య,కాగితపు విజయ్ కుమార్ బూర్గుల రవికుమార్, బోరింగ్ శంకర్,, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి: భైంసా:నిర్మల్ జిల్లా తనూర్ మండల కేంద్రంలోని ఝరి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన గడ్డేమొల్ల రుక్మాభాయి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ,మాజీ శాసన సభ్యులు బొస్లె నారాయణ్ రావు పటేల్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన రుక్మాభాయి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఝరి సర్పంచ్ బాబన్నా, వడ్డామ్ సర్పంచ్ గోవింద్ రావు పటేల్, తానూర్ మండల అధ్యక్షులు పుండలీక్, మాధవరావు పటేల్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, మధు పటేల్, లక్ష్మణ్, డాక్టర్ యోగేష్, వాగ్మారే అనిల్, ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్ గంగాధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి కి ఘన సన్మానం



చేర్యాల/జనగామ, ప్రజాస్ఫూర్తి : చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డిని జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి,హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రశాంత్‌రెడ్డి రైతులు, వ్యాపారులు, మార్కెట్‌కు వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.మార్కెట్ కమిటీ ద్వా రా రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా చొరవ చూపాల ని వారు కోరారు. నూతన బాధ్యతల్లో ప్రశాంత్‌రెడ్డి విజయవంతంగా రాణించి మరింత ప్రజాసేవ చేయాలని ఆకాంక్షి స్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా ఇరువురు పరస్పరం ఆత్మీయం గా మాట్లాడుకుని, ప్రజా సమస్యలు, అ భివృద్ధి అంశాలపై చర్చించారు. ప్రశాంత్ రెడ్డికి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ,ప్రజాస్ఫూర్తి : ప్రజావాణిలో ప్రజలు సమర్పించే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించా రు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షా లోమ్ తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీ కరించారు. ఈ సందర్భంగా 405 అర్జీల ను స్వీకరించిన కలెక్టర్, వాటిని సంబం ధిత శాఖల అధికారులకు కేటాయించి, పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పు డు పరిష్కరించాలని సూచించారు. ప్ర జా సమస్యల పరిష్కారంలో వేగం పెం చాలని ఆదేశించారు. కార్యక్రమంలో జె డ్పీ సీఈఓ బలరామారావు, డీఆర్డీఓ భా స్కర్, సీపీఓ చినకోట్యా నాయక్,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చిరునవ్వుల్లో వెలిగిన మొట్ల తండా

స్ఫూర్తి చేయూతకు పిల్లల హర్షం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సరైన చేయూత అందితే ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దీటుగా రాణించగలరని నిరూపించే విధంగా మొట్ల తండా ప్రాథమిక పాఠశాలలో ఆదివారం సందడి నెలకొంది. మహబూబాబాద్ మండలంలోని, మొట్ల తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తి రూరల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన టీ షర్ట్స్, విద్యా సామాగ్రిని ఘనంగా పంపిణీ చేశారు.కంటేం నవీన్,శ్రీదేవి దంపతుల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. కొత్త టీ షర్ట్స్ అందుకున్న చిన్నారుల మోహాల్లో ఆనందం వెల్లివిరియడం కనిపించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.ఇప్పటికే పలు పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు,పెన్నులు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందజేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు.ప్రభుత్వ బడి పిల్లలు కూడా అన్ని రంగాల్లో ముందుండాలన్నదే తమ సంస్థ ప్రధాన ఆశయమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇలాంటి సహకారం అందించడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని,వారి సేవా దృక్పథం ఇతరులకు స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, కంబాలపల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గిరిజ,అసిస్టెంట్ సెక్రెటరీ లక్ష్మి,స్ఫూర్తి సంస్థ అధ్యక్షులు రామసహాయం శ్రీధర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య,సభ్యులు ఎన్. ఉపేందర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ మూడు బిక్షా, తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతుల్లో వన్యప్రాణుల డేటా సేకరణ



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేట్-2026లో భాగంగా ఫేజ్-3 క్షేత్రస్థాయి కార్యకలాపాలను శాస్త్రీయ ప్రమాణాలతో, సమర్థవంతంగా నిర్వహించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం వనవిహార్ కాంప్లెక్స్‌లోని భద్రా మీటింగ్ హాల్‌లో ఒకరోజు సమగ్ర శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డివిజన్, వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ కిన్నెరసాని డివిజన్ మరియు సత్తుపల్లి డివిజన్‌లకు చెందిన ఎఫ్ఆర్ఓ, డీవైఆర్ఓ, బీట్ అధికారులు, ఇతర క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ క్యూరేటర్ రవికాంత్ పాల్గొని క్షేత్రస్థాయి కార్యకలాపాల్లో అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలు, డేటా సేకరణ పద్ధతులు, క్షేత్రస్థాయి పరిశీలనలు, రికార్డుల నిర్వహణపై శిక్షణనిచ్చారు. ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేట్ అనేది కేవలం పులుల సంఖ్యను అంచనా వేయడానికి మాత్రమే పరిమితమైన కార్యక్రమం కాదని, పులులు, ఇతర వన్యప్రాణులు ఆధారపడే అటవీ ఆవాసాల నాణ్యత, నీటి వనరులు, ఆహార జంతువుల లభ్యత, వన్యప్రాణుల కదలికలు, మానవ-వన్యప్రాణి పరస్పర చర్యలు, ఆవాసాలపై ఉన్న ఒత్తిళ్లను అర్థం చేసుకోవడానికి కీలకమైన శాస్త్రీయ ప్రక్రియ అని వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ కిన్నెరసాని డివిజన్ ఎఫ్‌డీఓ బాబు, ఎఫ్ఆర్ఓలు ఉపేంద్ర, స్నేహలత, సత్తార్ అలీ, కిరణ్ కుమార్, కనకమ్మ, గీతామాధురి, జ్యోత్స్నాదేవి, బీట్ అధికారులు పాల్గొన్నారు.

*** గల్లీ గల్లీకి బీజేపీ పిలుపు**

తండాల గడ్డపై కాషాయ జెండా



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :మహబూబాబాద్ జిల్లాలో భారతీయ జనతా పార్టీని తిరుగులేని శక్తిగా నిలపడమే లక్ష్యంగా ఎస్టీ మోర్చా దూకుడు పెంచింది. జిల్లాలోని ప్రతి తండా, ప్రతి గ్రామం, ప్రతి గల్లీలో కాషాయ జెండా రెపరెపలాడాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆ సంస్థ నిర్ణయించింది.మహబూబాబాద్ జిల్లా బీజేపీ ఎస్టీ మోర్చా నూతన జిల్లా టీమ్ నియామక పత్రాల అందజేత కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది.జిల్లా అధ్యక్షులు గూగులోత్ సురేష్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.ఈ సందర్భంగా సురేష్ నాయక్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో ఎస్టీ మోర్చాను జిల్లాలో మరింత బలోపేతం చేయడానికి ప్రతి నాయకుడు,ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతమే కాకుండా ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను తండాల్లోని చివరి వ్యక్తికి చేరేలా ప్రచారం చేయాలని కోరారు.నూతనంగా నియమితులైన జిల్లా టీమ్ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపి, కలిసికట్టుగా పని చేసి జిల్లాలో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ఒద్దిరాజు రామచంద్రరావు,జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు,ఎస్టీ మోర్చా జిల్లా నాయకులు, నూతనంగా నియమితులైన జిల్లా టీమ్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదవిద్యార్థికి 10 వేల ఆర్థిక సాయం అందజేత



ప్రజాస్ఫూర్తి, ఆదిలాబాద్ జిల్లా :పేదరికం కారణంగా ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి కూడా ఉన్నత చదువులకు దూరం కాకూడదని బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు . నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కొమురం భీం ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్న జిల్లాలోని బోథ్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థి ఇర్నాల సాయిచరణ్ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని ఆయన చలించిపోయారు. విద్యార్థి కళాశాల ఫీజులు, ఇతర ఖర్చుల నిమిత్తం తన వంతుగా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా తుల శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుకోవాలనే తపన, ప్రతిభ ఉన్న నిరుపేద విద్యార్థులకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పూసలు అమ్ముకునే నిరుపేద కుటుంబం నుంచి వచ్చి ప్రతిష్టాత్మక మెడికల్ సీటు సాధించిన సాయిచరణ్ పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బండారి శ్రీధర్ రెడ్డి, బోథ్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్,మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బొడ్డు శ్రీనివాస్, వీడిసి అధ్యక్షుడు అల్లకొండ పోతన్న,సిరిసే సంజీవ్,రాకేష్ రెడ్డి, రోహిత్, ప్రవీణ్, ఇఫతేకర్,మల్లెపూల విజయ్ కుమార్,గంగామల్లు,రాజకుమార్ బీ ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మార్పు వైపు అడుగులు రిమ్స్‌లో మెరుగైన పారిశుద్ధ్యం, భద్రత

*** కొత్త ఏజెన్సీల రాకతో సేవల్లో స్పష్టమైన మార్పు**




ప్రజాస్ఫూర్తి :ఆదిలాబాద్: ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, భద్రతా ఏర్పాట్లు గణనీయంగా మెరుగుపడుతున్నాయి. . సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి కొత్త కాంట్రాక్టర్లు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ మార్పు కనిపిస్తోందని రోగులు, వారి సహాయకులు చెబుతున్నారు. ఇప్పటివరకు రిమ్స్‌లో పారిశుద్ధ్య పనులు మెప్మా ద్వారా కొనసాగాయి. ఈ పనులను మరింత సమర్థంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ గారు కొత్త ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాల కోసం రెండు ఏజెన్సీలను, స్థానికంగా పనిచేసే రెండు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను ఎంపిక చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో కాంట్రాక్టు పనులు చేపట్టేందుకు అర్హత ఉన్న ఈ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించారు. గత నెల రోజులుగా ఈ ఏజెన్సీలు పారిశుద్ధ్యం, భద్రత పర్యవేక్షణ వంటి విధులను నిర్వర్తిస్తున్నాయి. దీంతో వార్డులు, ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంటున్నాయని, భద్రతా ఏర్పాట్లు కూడా మెరుగయ్యాయని అధికారులు చెబుతున్నారు.కలెక్టర్ తీసుకున్న ఈ చర్యలతో రోగులకు మెరుగైన వాతావరణం అందుతోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో సేవలు కొనసాగాలని వారు కోరుతున్నారు.

మద్యం సేవించి వాహనం నడపవద్దు



మహబూబాబాద్,ప్రజా స్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని ముత్యాలమ్మ గుడి సెంటర్లో వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ తో పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, కేసులు నమోదు చేశారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్ఐ అరుణ్ కుమార్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ చందు పాల్గొన్నారు.

రోడ్డుకై రోడ్డెక్కిన ప్రజలు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:భారీ వాహనాల రాకపోకలవల్ల తీవ్ర దుమ్ము, దూళితో అనారోగ్యాలపాలవుతున్నామని, తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లోగల శేషగిరినగర్ కాలనీవాసులు రోడ్డెక్కారు. సోమవారం కాలనీ వద్ద బైపాస్‌రోడ్‌పై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బైపాస్ రోడ్‌లో ప్రతిరోజు వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల రోడ్డు మొత్తం కొట్టుకుపోయిందని, మట్టిరోడ్డులా తయారవడంతో దుమ్ము, దూళి ఇళ్లలోకి చేరుకుందని, ఇంట్లో వస్తువుల దగ్గరి నుంచి చెట్లపై కూడా దుమ్ము పేరుకుపోతుందని అన్నారు. శ్వాసనాలాల్లోకి దుమ్ము, దూళి చేరడంతో అనారోగ్యాలకు గురై ఆస్పత్రులపాలవుతున్నామని ఆరోపించారు.ఎన్నిసార్లు ప్రజా ప్రతినిధులకు విన్నవించినా తమ గోడు పట్టించుకోపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టని పక్షంలో రోడ్డును పూర్తిగా మూసివేస్తామని హెచ్చరించారు.

రాములు పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మున్సిపల్ కౌన్సిలర్



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: భువనగిరిలోని ఇందిరా నగర్‌కు చెందిన నరాల రాములు మృతి చెందడంతో ఆయన పార్థివ దేహానికి 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ పూల మాలలు వేసిఘనంగా నివాళులు అర్పించారు అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్నివ్యక్తం చేశారు ఇంకా రాములుమృతి కుటుంబ సభ్యులతో పాటు స్థానికులకు తీరనిలోటని వారన్నారు ఈ కార్యక్రమంలోబండారు రవివర్ధన్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ పోటీల్లో రాణించిన ఎంజేపీ విద్యార్థులు



కూసుమంచి, ప్రజాస్ఫూర్తి: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ అండర్ 14, అండర్ 17, ట్రయ ల్స్ విభాగంలో నాయకునిగూడెం లోని మహాత్మ జ్యోతిబా పూలే విద్యార్థులు అత్యంత ప్రతిభని కనబరిచినట్లు ప్రిన్సిపాల్ మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ 17 విభాగం లో ఏ. నాగరాజు 10వ తరగతి ,ఎస్. అశ్వంత్ 9వ తరగతి అండర్ 14 విభాగం లో కె.యశ్వంత్, మహేష్, ఎం.యశ్వంత్ , ఆలాగే కె. యశ్వంత్ అండర్ 14 త్రాయతన్ లో రాష్ట్ర స్థాయికి ఎంపికయినట్లు తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను ఖమ్మం జిల్లా బిసి గురుకులాల ఆర్సిఒ సి.హెచ్. రాంబాబు , ప్రిన్సిపాల్ పి. మల్లయ్య, ఏటీపీ ప్రేమలత, వ్యాయామ ఉపాధ్యాయులు బి. నరసింహ,టి. భాస్కర్ పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసారు.


పౌష్టికాహారం తోనే సంపూర్ణ ఆరోగ్యం

సిడిపిఓ ఎ. పార్వతి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: గర్భిణ స్త్రీ లు బాలింతలు పిల్లలు ప్రతి రోజు తగు పాళ్ళలో పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునని ఐసిడిఎస్ హుజూర్నగర్ ప్రాజెక్ట్ సిడిపిఓ ఎ. పార్వతి అన్నారు. తొమ్మిదవ జాతీయ పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా కీతవారిగూడెం సెక్టార్ పరిధిలో వెలిదండ గ్రామ రైతు వేదిక వద్ద తొమ్మిదవ జాతీయ పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీ లు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికహారం అందించటం తో పాటు,ప్రీ స్కూల్ విద్యను కూడా అందిస్తున్నారని అర్హులైన అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం పిల్లలకు అన్నప్రాసన అక్షర అభ్యాసం చేయించినారు. అనంతరం సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు తక్కువ ఖర్చుతో, ఎక్కువ పోషకాలు ఉండే విదంగా తయారు చేసిన పౌష్టికాహారాన్ని స్టాల్స్ లో ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో వెలిదండ సర్పంచ్ చెనగాని సాంబయ్య, వెలిదండ ఉప సర్పంచ్ యానాల సోమయ్య, రంగాపురం సర్పంచ్ కట్టా కళ్యాణి,అంగన్వాడి సూపర్వైజర్ పోటు వసంత లక్ష్మి,పోషణ అభియాన్ కోఆర్డినేటర్ యానాల రాజేష్ అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపేటలో వార్డు అధికారుల బదిలీలు



మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి): ఎల్లంపేట మున్సిపాలిటీలో పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు కార్యాలయ సేవలను వేగంగా అందించేందుకు పలువురు వార్డు అధికారులు, పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ మున్సిపల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీలో రెవెన్యూ ఇన్స్పెక్టర్, శానిటరీ ఇన్స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటరీ విభాగాలకు సంబంధించిన కార్యకలాపాలను సంబంధిత అధికారులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.బదిలీ అయిన అధికారులు,తమకు కేటాయించిన వార్డుల్లో 48 గంటల్లోగా విధుల్లో చేరాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా బాధ్యతలు స్వీకరించకపోతే నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

విద్యార్థినులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

: జిల్లా సందీప్ కుమార్ ఝా.



నర్మెట్ట/జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని నర్మెట్ట మండల కేంద్రంలో గల గిరి జన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు పరిశుభ్రమైన వాతావ రణం కల్పించడంతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అధికారుల ను ఆదేశించారు. పాఠశాలలో తరగతి గదులు,పరీక్షల నిర్వహణ,వసతి గృహా లు, వంటశాల,భోజనశాల, మరుగు దొ డ్లు,సరుకుల నిల్వ గది, మైదానం తది తరాలను కలెక్టర్ పరిశీలించారు.మెనూ ప్రకారం తాజా కూరగాయలతో నాణ్య మైన ఆహారం అందించాలని, అవసర మైన ఫ్యాన్లు, లైట్లు సమకూర్చాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లోని చెత్తాచెదారం,పిచ్చి మొక్కలు, అనవస ర సామగ్రిని వెంటనే తొలగించి నిరంత రం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదే శించారు. విద్యార్థినుల విద్యతో పాటు ఆరోగ్యం, భద్రత, వసతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

అమ్మవారి విగ్రహ ఆగమన పోస్టర్ ఆవిష్కరణ



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):జిల్లా కేంద్రంలోని 30వ వార్డు రెడ్డికాలనీ వాసుల ఆధ్వర్యంలో గత ఆరు సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7న సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న అమ్మవారి విగ్రహ ఆగమన కార్యక్రమ పోస్టర్‌ను బీజేపీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందుపట్ల కీర్తిరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి పాపయ్య ఆవిష్కరించారు.జిల్లా కేంద్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పార్టీలకతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు మాడ హరీష్‌రెడ్డి, బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ చీర్ల అశోక్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రూ.23.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

*** పుష్కరాల పనులు, రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలు, ఆరోగ్య ఉపకేంద్రాలకు శ్రీకారం**



ప్రజాస్ఫూర్తి, భైంసా:జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు సోమవారం శంకుస్థాపనలు చేశారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి దాదాపు రూ.23.35 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించి శంకుస్థాపనలు చేశారు.వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించిన రహదారుల నిర్మాణ పనులతో పాటు రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలకు సంబంధించిన నిర్మాణ పనులకు మంత్రులు శ్రీకారం చుట్టారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు అందించేందుకు చేపడుతున్న ఈ పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అధికారులు చర్యలు చేపట్టనున్నారు.జిల్లా పర్యటనకు సోమవారం ఉదయం నిర్మల్ చేరుకున్న రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల ఉన్నతాధికారులు డి.ఎస్. లోకేష్‌కుమార్, రాజీవ్‌గాంధీ హనుమంతు, వి.పి. గౌతమ్‌లకు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులు ఘన స్వాగతం పలికారు. మంత్రులు, ఉన్నతాధికారులకు కలెక్టర్ భవేశ్ మిశ్రా పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అక్కడి నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు భవేశ్ మిశ్రా, రాజర్షి షా, హరిత,నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, ఆర్ ఎస్ చిత్రు, చంద్రయ్య, రాములు, డేవిడ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్,ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఉట్నూర్ ఐ టి డి ఎ పి ఓ మంద మకరందు, సబ్ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ, గృహ నిర్మాణ అంశాలపై మంత్రుల సమీక్ష

*** భూ సమస్యల పరిష్కారం.. ఇళ్ల నిర్మాణం వేగవంతంపై సమీక్ష**



ప్రజాస్ఫూర్తి, భైంసా:జిల్లాలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌లో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో కొనసాగుతున్న కార్యక్రమాలు, సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రులు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి భూ సమస్యలు, భూ పరిపాలన, రికార్డుల నిర్వహణ, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణాలు నిర్దిష్ట గడువులోగా పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరుపై మంత్రులు సమీక్షించారు. జిల్లాల వారీగా చేపడుతున్న కార్యక్రమాలు, పురోగతిని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్,ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి,ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లను త్వరలోనే ప్రారంభిస్తాం

*** జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ప్రజాస్ఫూర్తి,ఆదిలాబాద్ : అక్టోబర్ రెండో వారంలో పత్తి కొనుగోళ్లను త్వరలోనే ప్రారంభిస్తామని,సోమవారం నాటికి తుది తేదీని ఖరారు చేసి రైతులకు సమాచారం అందిస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషాఅన్నారు.సోమవారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డును మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా లతో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షిషా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు దిశ నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈసారి ఏఈఓ పద్ధ ప్రత్యేకంగా మాయిశ్చరు మీటరును అందుబాటులో ఉంచామని, రైతులు అక్కడికి వెళ్లి తేమ శాతం చెక్ చేసుకుని పత్తిని తీసుకురావాలని సూచించారు. తూకం సంబంధిత సమస్యల పరిష్కారం కోసం డిజిటల్ డిస్ప్లేలు, జిరాక్స్ సెంటర్లు, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రైతులు తమ పట్టాదార్ పాస్‌బుక్, కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ ఐడీ, ఆధార్ లింక్ ఉన్న బ్యాంకు పాస్‌బుక్ తదితర ప్రాథమిక పత్రాలతో వస్తే మూడు రోజుల్లోగా ఖాతాలో డబ్బులు జమ చేయబడతాయని తెలిపారు. మహారాష్ట్ర రైతుల పత్తి కొనుగోలు కోసం ప్రత్యేకంగా కొన్ని జిన్నింగ్ మిల్లులను కేటాయించి, ఇరు ప్రాంత రైతుల మధ్య ఎలాంటి వివాదాలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దాదాపు 4 నెలల పాటు జరిగే ఈ కొనుగోళ్ల ప్రక్రియలో రైతులు రాంపూర్ నుంచి మార్కెట్‌కు రావాలని కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం దృష్ట్యా ఈసారి ముందస్తుగానే పత్తి కొనుగోళ్లు చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు వ్యవసాయ చైర్మన్లు, సీసీఐ అధికారులు, మహారాష్ట్రలోని మాహూర్, కిన్వాట్ అధికారులతో పాటు అదిలాబాద్ అధికారులతో కలిసి ఒక కీలక సమావేశం నిర్వహించమన్నారు. ఈ నెల 12వ తేదీన కొనుగోళ్లు ప్రారంభించాలని మొదట నిర్ణయించినప్పటికీ, ఎంత ముందు తేదీ ఇస్తే ఆ తేదీకే పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులకు ఆయన స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానన్, సెక్రటరీ విఠల్, మార్కెట్ కమిటీ సభ్యులు, మార్కెట్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

బీవీఆర్ఐటీలో ఘనంగా ఎం.టెక్ ఫ్రెషర్స్ ఇండక్షన్ ప్రోగ్రామ్





నర్సాపూర్, ప్రజాస్ఫూర్తి బీవీఆర్ఐటీ నర్సాపూర్ ప్రాంగణంలో ఎం.టెక్ ప్రథమ సంవత్సరం నూతన విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ కె. విష్ణు రాజు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పరిశ్రమలతో అనుసంధానమై నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడంతో పాటు, బీవీఆర్ఐటీ పూర్వ విద్యార్థుల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని కెరీర్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.బీవీఆర్ఐటీ పలు ప్రముఖ పరిశ్రమలు, ఈవీటీ టెక్నాలజీస్, ఇంజినీరింగ్ డిజైన్ సంస్థలతో అకడమిక్-ఇండస్ట్రీ భాగస్వామ్యాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. ఈ భాగస్వామ్యాల ద్వారా ఎం.టెక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోని ప్రముఖ ఐఐటీలతో పరిశోధన, అకడమిక్ సహకారాన్ని కొనసాగిస్తున్నామని, క్యాంపస్‌లోని ఆధునిక పరిశోధనా ప్రయోగశాలలు, ఇతర సదుపాయాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ ఛైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ ఉన్నత విద్య ప్రాధాన్యతను వివరించారు. పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ పరిశోధనలతో పాటు అకడమియా-పరిశ్రమల మధ్య బలమైన సంబంధాలను ఏర్పరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే, ఇండస్ట్రీ రిలేషన్స్ అసోసియేట్ డైరెక్టర్ డా. వంశీకృష్ణ, అకడమిక్ డీన్ డా. మురళీకృష్ణ, వివిధ విభాగాధిపతులు, డీన్లు, పీజీ కోఆర్డినేటర్లు, ఎం.టెక్ నూతన విద్యార్థులు పాల్గొన్నారు. డీజీఎం కాంతారావు, కళాశాల మేనేజర్ బి. బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ తదితరులు హాజరయ్యారు.

హమాలీల భద్రత మా బాధ్యత

: వికారాబాద్ ఎఎంసీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్



వికారాబాద్ ,ప్రజా స్ఫూర్తి: హమాలీల భద్రత మా బాధ్యతఅని వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు.సోమవారం వైస్ చైర్మన్ మల్లేశం ఆధ్వర్యంలో వికారాబాద్ మార్కెట్ యార్డులో పనిచేస్తున్నటువంటి హమాలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలీలకు మార్కెట్ కమిటీ తరపునుండి రూ. 2 లక్షల ప్రమాద బీమా వర్తింప చేస్తామని అదేవిధంగా ప్రభుత్వం ద్వారా అందించే లేబర్ ఇన్సూరెన్స్ కార్డు సైతం ప్రతి ఒక్క హమాలీకి అందేలా చూస్తామన్నారు. హమాలీలకు సంబంధించిన వివిధ సమస్యలపై చర్చించి వారికీ తప్పకుండ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు దారులు , హమాలీలు పూర్తిగా సహకరించాలని త్వరలో మార్కెట్ తరపున హమాలీలకు నూతన వస్త్రాలు అందిస్తామని తెలియచేసారు ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ ,సభ్యులు పాల్గొన్నారు.

కరెంటు కోతలపై రైతుల ఆందోళన


*** పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం**



హత్నూర, ప్రజాస్ఫూర్తి: చేతికొస్తున్న వరి పంటలు ఎండిపోతుండగా, నిరంతరం విద్యుత్ కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నస్తీపూర్ సబ్‌స్టేషన్ ఎదుట మంగాపూర్ గ్రామానికి చెందిన రైతులు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. పంట సాగు ప్రారంభం నుంచి పంట చేతికొచ్చే దశ వరకు రైతులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవైపు వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కనీసం 6 గంటలు కూడా సక్రమంగా విద్యుత్ అందడం లేదని రైతులు ఆరోపించారు.ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యుత్ అధికారులు స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే మండలవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి మండల స్థాయి ప్రజావాణి

: కె. శివ శంకర్ రెడ్డి..



లింగాలఘణపురం / జనగామ, ప్రజా స్ఫూర్తి : ప్రజా సమస్యలను తెలుసుకొ ని వాటిని సత్వరమే పరిష్కరించేందు కు మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో సోమవారం మండల స్థాయి ప్రజా వాణి కార్యక్రమాన్ని నిర్వహించిన్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. శివశంకర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమం లో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను అధికారు లు స్వీకరించారు. ఈ సందర్భంగా మొ త్తం 9 దరఖాస్తులు అందగా, అందులో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 7, రెవె న్యూ శాఖకు సంబంధించి 2 దరఖాస్తు లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.దర ఖాస్తులను సంబంధిత శాఖల అధికా రులకు పంపించి, నిబంధనల ప్రకారం పరిశీలించి సమస్యలను పరిష్కరించేం దుకు చర్యలు తీసుకుంటామని తెలిపా రు. ప్రజలు తమ సమస్యలను ప్రజావా ణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువ చ్చి, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించా రు. కార్యక్రమంలో ప్రజా వాణి నోడల్ అ ధికారి, మండల ప్రజా పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా జలాల సద్వినియోగంపై దృష్టి సారించండి!

హైదరాబాద్: కృష్ణా బేసిన్ పరిధిలో ఇంకా నీటి వినియోగానికి ఎక్కడెక్కడ అవకాశాలు ఉన్నాయో పరిశీలించాలని, ప్రస్తుతం ప్రాజెక్టుల వారీగా ఉన్న కేటాయింపులు పోను మిగిలిన జలాలను వాడుకోవడానికి ఉన్న అవకాశాలపై దృష్టి సారించాలని నీటిపారుదల ఇంజినీర్లు, అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. సోమవారం రాత్రి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటిపారుదల ప్రాజెక్టులపై సీఎం సుదీర్ఘంగా చర్చించారని, కృష్ణా జలాల సద్వినియోగంపై దృష్టిసారించాలని సూచించారని సమాచారం. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, ఈఎన్సీ రమేశ్‌బాబు, సీఈలు పాల్గొన్నారు. కాళేశ్వరం అదనపు టీఎంసీలో భాగంగా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మల్లన్నసాగర్ వరకు ఇప్పటికే జరిగిన పనులు, డిండి ఎత్తిపోతలు, కాళేశ్వరం బ్యారేజీ పునరుద్ధరణలో పురోగతి, ప్రాజెక్టుల కింద భూసేకరణ తదితర అంశాలపై సీఎం ఆరా తీసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు...

బేసిన్‌లోని ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక

''కృష్ణానది పరీవాహకంలో ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులు, వాటి కేటాయింపులు, వినియోగాన్ని తేల్చాలి. ఇంకా నీటి వినియోగానికి అనువైన ప్రాంతాలు, ప్రాజెక్టుల నిర్మాణానికి ఉన్న అనుకూలతలను గుర్తించాలి. కేటాయింపుల మేరకు పూర్తిస్థాయి నీటి వినియోగంపై నిశిత దృష్టి సారించాలి. కృష్ణా జలాల్లో ఎక్కువ వాటా సాధించడానికి ప్రయత్నించాలి. నదీ జలాలపై ఒక సమగ్ర నివేదిక రూపొందిస్తే మరోసారి ప్రత్యేకంగా చర్చిద్దాం' అని సీఎం పేర్కొన్నారు.

*** కాలువలు లేకపోవడంతో రూ.కోట్ల ఖర్చు వృథా**

రాష్ట్రంలో ప్రాజెక్టుల కింద రూ.కోట్లు వ్యయం చేసినా... ఆయకట్టుకు నీళ్లు అందడం లేదని సీఎం రేవంత్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ''కాళేశ్వరం అదనపు టీఎంసీ కింద రూ.వేల కోట్లు ఖర్చు చేశారు. భూసేకరణ, పునరావాసం సమస్యలను పరిష్కరించకపోవడం, కాలువల వ్యవస్థను నిర్మించకపోవడంతో రూ.కోట్ల వ్యయం వృథాగా మారింది. శ్రీపాద ఎల్లంపల్లి నుంచి మధ్య మానేరు మీదుగా మల్లన్నసాగర్ వరకు అదనపు టీఎంసీ పనులు ఎంతవరకు వచ్చాయో పరిశీలించాలి. పనులకు ఏయే సమస్యలు అవరోధంగా మారాయో తేల్చాలి' అని సీఎం సూచించగా... అధికారులు పలు వివరాలు తెలిపినట్లు తెలిసింది. ''శ్రీపాద ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు వరకు నాలుగు, మధ్యమానేరు నుంచి మల్లన్నసాగర్ వరకు నాలుగు ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. మొత్తం రూ.32,060 కోట్ల అంచనాలున్న మొదటి దశ నాలుగు ప్యాకేజీల్లో 52% పనులు, రెండో దశ నాలుగు ప్యాకేజీల్లో 61% పనులు పూర్తయ్యాయి. మొత్తం రూ.18 వేల కోట్లు ఖర్చు చేయగా రూ.2,200 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. భూ సేకరణ సమస్యలు ఉన్నాయి'' అని అధికారులు వివరించినట్లు సమాచారం. సీఎం స్పందిస్తూ... భూసేకరణ చేయకుండా ప్రధాన పనులు చేసి ఏం లాభం. ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలి కదా అన్నట్లు తెలిసింది. దీనిపై ఒక నివేదిక రూపొందిస్తే.. త్వరలో ప్రత్యేకంగా చర్చిద్దామంటూ సూచించినట్లు తెలిసింది.

డిండి, కాళేశ్వరం బ్యారేజీలపై...

డిండి ఎత్తిపోతల పథకంపైనా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. డిండికి నీటి కేటాయింపుల సమస్యను పరిష్కరిస్తామని, సమస్యను ప్రభుత్వానికి వదిలి క్షేత్రస్థాయిలో పనులు చేయాలని ఇంజినీర్లకు సీఎం సూచించినట్లు సమాచారం. కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణపై సీఎం ఆరా తీసినట్లు తెలిసింది. బ్యారేజీల్లో పరీక్షలు, పునరావాస డిజైన్లు, పునరుద్ధరణ పనుల ప్రణాళికలు ఎక్కడి వరకు వచ్చాయంటూ ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. ''ప్రాజెక్టుల కింద భూసేకరణను వేగంగా పూర్తి చేయాలి. ఈ ప్రక్రియకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇస్తుంటే జాప్యం ఎందుకు జరుగుతోంది.. లక్ష్యం మేరకు పనులు చేయడానికి ఎంత సమయం పడుతుంది.. ప్రాజెక్టుల వారీగా ఎంత భూమి అవసరముంది'' అని సీఎం ప్రశ్నించినట్లు సమాచారం. అవరోధాలను గుర్తించి ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆయన ఆదేశించినట్లు తెలిసింది.

మహిళలపై నేరాలకు చెక్ పెట్టండి: సుప్రీం

మహిళలపై నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తుల మనసుల్లో భయాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని ఢిల్లీ పోలీసులకు హితవు పలికింది. ఇటీవల ఢిల్లీజాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వరుసగా చోటుచేసుకున్న అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ పార్థీవాలా మాట్లాడుతూ.. "మహిళలపై దాడులకు పాల్పడాలనుకునే దుండగులకు తాము పట్టుబడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉండాలి. అలాంటి వాతావరణాన్ని మీరు కల్పించాలి" అని పోలీసులను ఆదేశించారు. నేరాలను అరికట్టేందుకు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఢిల్లీలో మహిళల భద్రతకు సంబంధించి పలు నిర్దిష్ట ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, వెలుతురు సరిగా లేని ప్రదేశాలను గుర్తించి వెంటనే లైటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని సూచించింది. అలాగే, నిఘా వ్యవస్థలను పటిష్టం చేయాలని తెలిపింది. దుండగులు, పోకిరీలు ఎక్కువగా గుమికూడే అక్రమ తినుబండారాల కేంద్రాలు, మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో అమ్మాయిలను వేధించే వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది. దేశ రాజధాని పరిధిలో మైనర్లపై జరిగిన లైంగిక దాడులతో సహా వరుస అత్యాచార ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో కూడా కోర్టు మహిళల భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, ఇతర తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణలో తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

వర్క్ వీసాలపై ట్రంప్ కొరడా..
ఈ వారమే నిర్ణయం!

అమెరికాలో విదేశీయులకు జారీ చేసే ఉద్యోగ వీసా కార్యక్రమాలపై ట్రంప్ యంత్రాంగం తన వైఖరిని మరింత కఠినతరం చేయనుంది. ముఖ్యంగా హెచ్ 1బీ వంటి వీసాలపై పర్యవేక్షణను తీవ్రతరం చేస్తూ ఈ వారంలోనే కీలక చర్యలు తీసుకోబోతున్నట్లు అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి'ఎస్పోసిటో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామంతో విదేశీ ఉద్యోగులలో, వారిపై ఆధారపడిన కంపెనీలలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆంథోనీ డి'ఎస్పోసిటో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా చేసిన ఒక పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. "ఈ వారం విదేశీ లేబర్ వీసాల విషయంలో చాలా కీలకమైనది. మేము ఈ అంశాన్ని సరికొత్త స్థాయికి తీసుకెళ్తున్నాం. అమెరికన్ ఉద్యోగాలు.. అమెరికన్ కార్మికులు" అని ఆయన పేర్కొన్నారు. అయితే, ఏయే వీసా కార్యక్రమాలను లక్ష్యంగా చేసుకుంటున్నారో, ఏ కంపెనీలపై చర్యలు ఉంటాయో? లేదా ఎలాంటి దర్యాప్తులు చేపట్టనున్నారో? ఆయన తన పోస్ట్‌లో స్పష్టంగా వెల్లడించలేదు. ఈ ప్రకటన రాబోయే చర్యల తీవ్రతను సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది ట్రంప్ ప్రభుత్వం కొంతకాలంగా అనుసరిస్తున్న విస్తృత విధానంలో భాగమే. ఉపాధి ఆధారిత వలస విధానాలను కఠినతరం చేయడంపై, ముఖ్యంగా హెచ్ 1బీ వీసా కార్యక్రమంపై, ట్రంప్ సర్కార్ మొదటి నుంచి దృష్టి సారించింది. సెప్టెంబర్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక కార్యనిర్వాహక ఉత్తర్వుపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్) సంతకం చేశారు. దీని ప్రకారం హెచ్ 1బీ వీసాల కోసం దరఖాస్తు చేసుకునే కంపెనీలు.. అదే విధమైన నైపుణ్యాలు కలిగిన అమెరికన్ ఉద్యోగులను ఇటీవల తొలగించాయా లేదా తొలగించే ప్రణాళికలో ఉన్నాయా అనే విషయాన్ని సంబంధిత ఏజెన్సీలు తప్పనిసరిగా సమీక్షించాలని ఆదేశించారు. దీనికి అనుబంధంగా, అమెరికా వెలుపల ఉన్న కార్మికులకు సంబంధించిన కొన్ని ప్రత్యేక హెచ్ 1బీ పిటిషన్లపై విధించే లక్ష డాలర్ల ఫీజు ఆవశ్యకతను 2027 సెప్టెంబర్ వరకు పొడిగిస్తూ మరో ప్రకటన జారీ చేశారు. ఈ చర్యల ద్వారా వీసా ప్రక్రియను మరింత నియంత్రించి, అమెరికన్ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది.

*** హెచ్-1బీ పూర్తిగా విఫలమైన విధానం: జేడీ వాన్స్**

ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు కూడా ఇదే తరహా అభిప్రాయాలను బలంగా వినిపిస్తున్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్ 1బీ వీసా కార్యక్రమాన్ని పూర్తిగా విఫలమైనదిగా అభివర్ణించారు. కొన్ని కంపెనీలు అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ కార్మికులను నియమించుకోవడానికి ఈ వీసాలను ఒక సాధనంగా వాడుకుంటున్నాయని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ విధానంలోని లోపాలను సరిదిద్దడానికే తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద, విదేశీ వీసా కార్యక్రమాలలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న దుర్వినియోగాన్ని అరికట్టి, అమెరికన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంపై ట్రంప్ యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టిసారించినట్లు స్పష్టమవుతోంది.

'ఆప్టోజెనెటిక్స్'కు గుర్తింపు: ఈ ఏడాది వైద్యంలో ముగ్గురికి నోబెల్

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరోత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు. ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. 'క్లామిడోమోనాస్' అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై 'ఛానెల్‌రోడోప్సిన్' అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు. ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరోత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడోప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ 'కాంతి ఆధారిత స్విచ్' పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు. ప్రస్తుతం 'ఆప్టోజెనెటిక్స్' అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టిలోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

భారత్-అమెరికా వాణిజ్య చర్చలకు బ్రేక్: నిర్మల

భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు. భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్‌యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

లండన్-షికాగో విమానంలో ఎమర్జెన్సీ.. నిమిషాల్లో 28,000 అడుగులు కిందకు

లండన్ నుంచి అమెరికాలోని షికాగోకు వెళుతున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో సోమవారం అత్యవసర పరిస్థితి తలెత్తింది. ఐర్లాండ్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో విమానం ఎమర్జెన్సీ ప్రకటించింది. వెంటనే పైలట్లు 7700 ఎమర్జెన్సీ కోడ్‌ను యాక్టివేట్ చేసి.. విమానాన్ని 37,000 నుంచి సుమారు 9,000 అడుగుల కిందకు దించారు. నిమిషాల్లో ఏకంగా 28,000 అడుగులు కిందకు రావడం గమనార్హం. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్24 ప్రకారం.. బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం బీఏ295 అట్లాంటిక్ మీదుగా ప్రయాణిస్తుండగా ఎమర్జెన్సీ అలర్ట్ వచ్చింది. బోయింగ్ విమానం ఒక్కసారిగా కిందికి దిగడం, ఎమర్జెన్సీ కోడ్ పంపడంతో ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొంది. 7700 కోడ్‌ను విమాన సిబ్బంది సాధారణ అత్యవసర పరిస్థితిని సూచించేందుకు ఉపయోగిస్తారు. ఈ కోడ్ వచ్చినప్పుడు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి విమానానికి ప్రాధాన్య సహాయం అందుతుంది. అయితే అత్యవసర పరిస్థితికి కారణం ఏంటో ఈ కోడ్ ద్వారా తెలియదు. సాంకేతిక సమస్య, ప్రయాణికుడికి వైద్య అత్యవసర పరిస్థితి లేదా ఇతర కారణాలతోనూ ఈ కోడ్‌ను ఉపయోగించవచ్చు. బీఏ295 ఘటనకు అసలు కారణాన్ని బ్రిటిష్ ఎయిర్‌వేస్ వెంటనే వెల్లడించలేదు. విమానం పరిస్థితి, ఆ తర్వాతి ప్రయాణ మార్గంపై మరిన్ని వివరాలు రావాల్సి ఉంది. ఇటీవల ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్1073లో జరిగిన ఘటన తర్వాత మరో విమానం ఎమర్జెన్సీ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. అయితే బీఏ295 ఘటనకు, ఫ్లైదుబాయ్ ఘటనకు సంబంధం ఉన్నట్లు ప్రస్తుతానికి ఆధారాలు లేవు. సెప్టెంబర్ 30న ఎఫ్‌జెడ్1073 విమానంలో కాక్‌పిట్‌లో గొడవ జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో 7700తో పాటు 7500 కోడ్‌ను కూడా యాక్టివేట్ చేశారు. 7500 కోడ్‌ను విమానంలో చట్టవిరుద్ధ జోక్యం లేదా హైజాక్ పరిస్థితిని సూచించేందుకు ఉపయోగిస్తారు. ఆ విమానం సౌదీ అరేబియాలోని తబుక్‌కు మళ్లి సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ ఘటనపై యూఏఈ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలపై పిటిషన్లు.. కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అధికారాల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. ఇతర కమిషనర్లతో సంప్రదించకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.